ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 363
పేజీలు : 5 వెల రూ. 2/-
శుక్రవారం
22 ఏప్రిల్ 2026
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ

- గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనలు కోకొల్లలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



2 లో

## దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

- సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్
- రాజీవ్‌కు నివాళి అర్పించిన సిఎం రేవంత్



2 లో

# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

- కనీస వేతనాలు అమలుకు నిర్ణయం
- కేబినెట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం
- లబ్ధిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు
- బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు
- కెటిఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి

2 లో




## ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

- కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి రాక
- పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు



2 లో

## కొనుగోలు కేంద్రాల్లో మరణమృదంగం

- రైతులు పిట్టల్లా రాలుతున్నా ధాన్యం కొనరా
- ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడండి సిఎం గారు
- 23న జరిగే కేబినెట్ భేటీలో అయినా చర్చించండి
- సిఎం రేవంత్‌కు కెటిఆర్ బహిరంగ లేఖ

2 లో



# ఎంజేపి బ్రాండింగ్ క్రియేట్ చేయాలి

- విద్యార్థులకు సమగ్ర విద్యాబోధన జరగాలి
- 8 వ తరగతి నుండే నీట్, ఎంసెట్ తర్ఫీదు
- 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు అభినందనలు
- ఫలితాలు తక్కువగా వచ్చిన ప్రిన్సిపాల్ లకు హెచ్చరిక
- పూలే గురుకుల పాఠశాలల ఫలితాలపై సమీక్షలో మంత్రి పొన్నం



2 లో

# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

ఏఎం న్యూస్, హైదరాబాద్,మే21:
కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్స్, జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీసవేతనం నిర్ణయించాం అన్నారు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమి స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుందని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి.. కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని అంటూ ఎద్దేవా చేశారు. కేసీఆర్ దిగిపోయి చాలా రోజులు అయ్యింది. పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్.. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదు?. కులగణన విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. తెలంగాణ నిర్ణయాన్ని ఉన్నత న్యాయస్థానం సమర్థించడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. తెలంగాణలో జనగణనతో పాటు కులగణన చేసి అన్ని వివరాలు ప్రజల ముందుంచాం. 'జనగణనలో కులగణన' విషయంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచింది. మోదీ ప్రభుత్వం తక్షణమే జనగణనలో కులగణన చేర్చి బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలి' అని అన్నారు.

## దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

ఏఎం న్యూస్, హైదరాబాద్,మే21:
దేశం కోసం ప్రాణాలర్పించిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. 'కంప్యూటర్, ఐటీ, టెలికామ్‌లను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్‌గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. తెలంగాణ సమాజం సోనియాగాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది. మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ సర్కార్ కుయుక్తులు పన్నింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింక్ పెట్టారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. మహిళా బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పు కొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ

ఏఎం న్యూస్, హైదరాబాద్,మే21:
తెలంగాణలో గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్‌లో గోవుల అక్రమ రవాణా, వధ జరుగుతోందని అన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ కొందరు కావాలనే వాటిని ఉల్లంఘిస్తున్నారని ఆయన మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ జరుగుతోందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోమాత రక్షణ కోసం శాంతియుతంగా పనిచేస్తున్న గోరక్షకులు, బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. గోరక్షకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ కార్యకర్తలపై విధించిన బైండోవర్ చర్యలను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రాంచందర్ రావు సూచించారు. గోవధకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ÷రిలిలీసులు పక్షపాత ధోరణిని విడిచిపెట్టి చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు. గోమాత హిందువుల జీవన విధానంలో పవిత్రమైన భాగమని, పండుగల పేరుతో గోవధ చేస్తే సహించబోమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే శక్తులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో గోవధ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన తమ కార్యకర్తలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## ఎంజేపి బ్రాండింగ్ క్రియేట్ చేయాలి

ఏఎం న్యూస్, హైదరాబాద్,మే21:
మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాల పనితీరు పై మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను అభినందించారు. ఫలితాలు తక్కువగా వచ్చిన గురుకుల విద్యాసంస్థలు కారణాలు సమీక్షించుకోవాలని ఆయన సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలిని ఆయన అన్నారు. సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండాలని ఆదిశగా అధ్యాపక బృందం పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు , సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ, తదితర అంశాలపై ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను అభిందించడంతో పాటు ఉత్తీర్ణత శాతం తక్కువగా వచ్చిన పాఠశాలల ప్రిన్సిపాల్ లను మందిలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. గతంలో 327 స్కూల్ లలో 301 స్కూల్ లో ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయని, ప్రభుత్వం విద్యకు ప్రధాన్యత ఇవ్వడం తో గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయనీ తెలిపారు. గురుకుల పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రభుత్వం మెస్ ఛార్జీలు కాస్మొటిక్ చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వం మీద విశ్వాసంతో ,అధ్యాపకుల విశ్వాసంతో తమ పిల్లలను గురుకులాలకు పంపిస్తున్నారనీ తల్లిదండ్రుల కన్నా ఎక్కువగా ఉపాధ్యాయుల తోనే పిల్లలు సమయం ఇస్తారని తమ సొంత పిల్లల మాదిరి విద్యార్థులను చూసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మంచైనా,చెడైనా అధ్యాపకులు దిక్సూచి అని తెలిపారు. 026-27 సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని బీసీ సంక్షేమ శాఖ గురుకులాలు మరింత సమర్థవంతంగా విజయాలు సాధించాలనీ ఆకాంక్షించారు. ఎవరిని ఇబ్బంది పెట్టి పని చేయించుకోవడం లేదనీ పూర్తి స్థాయిలో విద్యా బోధన జరగాలనీ ఆదేశించారు. ప్రైవేట్ భవనాల్లో నెల వారి అ÷-దదె కడుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోతే కల్పించుకునే బాధ్యత ప్రిన్సిపల్ లది సూచించారు. టాయిలెట్స్, ఫ్యాన్స్,ఇతర మౌలిక సదుపాయాలు ఏం ఇబ్బందులు లేకుండా చూసుకోవాలనీ తెలిపారు. ఎంజేపీ గురుకులాలు అద్భుతంగా ఉండాలంటే అందరూ కలిసి సమిష్టి గా ఒక కుటుంబం లాగ పని చేయాలన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు జ్ఞాపకులపై ఆధారపడి ఉందన్నారు. సమాజంలో ఏ విధంగా బతకాలి , డిసిప్లెన్, తల్లిదండ్రుల తో ఎలా వ్యవహరించాలి.. పెద్దలతో ఎలా మాట్లాడాలి అని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. చిన్న చిన్న కారణాలతో గురుకులాల్లో సూసైడ్ జరుగుతున్నాయని విద్యార్థుల్లో మనో ధైర్యాన్ని కల్పించాలని వారిలో మోటివేటివ్ కల్పించాలన్నారు. జిల్లాలో ఉన్న స్కూల్స్ వారిగా సమీక్ష లు చేస్తూ వంద శాతం ఫలితాలు వచ్చిన స్కూల్స్ అభినందిస్తూ.. తక్కువ ఫలితాలు వచ్చిన స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలనీ సూచించారు. అధ్యాపకులంతాఎంజేపీ కి బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేయాలనీ పేర్కొన్నారు. పదవ తరగతి 98.45 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల సెక్రెటరీ సైదులు తో పాటు ప్రిన్సిపల్ లను అభినందించారు. 500 పైన వచ్చిన మార్కులు 9788 మంది విద్యార్థులకు వచ్చాయనీ204 ఎంజేపీ గురుకులాలు 100 శాతం ఫలితాలు సాధించాయనీ సంతోషం వ్యక్తం చేశారు. 65 స్కూల్స్ వెనుకబడి ఉన్నాయనీ ఆ స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలి ఉత్తీర్ణత తక్కువగా వస్తె మంచిది కాదనీ హెచ్చరించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 90.31 శాతం ,ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 97.72 శాతం , ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం లో 85.80 శాతం, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 95.81 శాతం పాస్ శాతం ఉందని 900 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 4183 మంది విద్యార్థులు ,980 మార్కులు పైన 496 మంది విద్యార్థులు సాధించారనీ ఇంటర్మీడియట్ లో తక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చిన గురుకులాలను హెచ్చరించారు. 35 విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయనీ అభినందించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 8 విద్యా సంస్థలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. ఎంజేపీలో చదివిన పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు నేరుగా ఇంటర్మీడియట్ తరగతులకు అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు ఇంకా ఏమి అవసరమని ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు.

# కొనుగోలు కేంద్రాల్లో మరణమృదంగం

ఏఎం న్యూస్, హైదరాబాద్,మే21:
పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర ముఖ్యమంత్రి గారూ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేబినెట్ మీటింగ్‌లోనైనా కళ్లు తెరవండి అని హితవు పలికారు. రైతుల ప్రాణాలు పోతున్నా.. పంటలు కొనరా..? కొనుగోలు కేంద్రాల్లో కుప్పకూలుతున్నా కనికరించరా అని మండిపడ్డారు. ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణ మృదంగ మేంటని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదని అన్నారు. ఇవాళ బూతులు తిడుతున్న రైతులే.. రేపు వాతలు పెడతారని హెచ్చరించారు. కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు రైతు చేతిలోనే కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు. రైతుకు రక్షణగా కేసీఆర్ అమలు చేసిన ఒక్కో పథకానికి గత రెండేన్నరేళ్లుగా పాతరేసిన మీరు మీ చేతకానితనంతో అన్నదాత వెన్నువిరిచారు. ఇవాళ మీ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయి. అష్టకష్టాలు పడి పండించిన పంటను కొనే దిక్కులేక రెండునెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆర్థనాదాలు చేస్తున్నారు. చేతకాని మీ సర్కారు నిర్వాకం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఏ మూలన చూసినా ఈరోజు రైతులు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. పంట అమ్ముకుందామనే ఆశతో వచ్చిన రైతులు రోజుల తరబడి పడిగాపులు పడలేక కొనుగోలు కేంద్రాల్లోనే గుండెపగిలి కుప్పకూలుతున్నా మీ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదు. 70 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టడంలో మీకున్న శ్రద్ధలో ఒక్క శాతం రైతులపై పెట్టి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. మీ కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీకి మూటలు మోయడం తప్ప రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనాలన్న సోయి మాత్రం మీలో కనిపించడం లేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద దాదాపు పదిమంది రైతులు వడదెబ్బకు తోడు సర్కారు చేసిన ద్రోహానికి తమ నిండు ప్రాణాలు కోల్పోయారు. ధాన్యం కుప్పలు మీ అసమర్థతకు ప్రత్యక్ష సాక్ష్యాలు. విలువైన భూములను తెగనమ్మి వేలకోట్లు దోచుకోవాలన్న ఉత్సాహం తప్ప రైతుల పంటలను కొనాలన్న ధ్యాస మీలో ఏమాత్రం కనిపించడం లేదు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా అనేక జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రోజుకు కనీసం ఒక్కటంటే ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదు. చివరికి గన్నీ బ్యాగు కోసం రైతులే 50 రూపాయల చొప్పున డిపాజిట్ చేసే దుస్థితి తెచ్చినందుకు మీరు, మీ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి. అన్నదాతలు అడుగడుగడునా పడిగాపులు పడుతుంటే వాటిని వదిలేసి, పర్యాటక వారోత్సవాలు నిర్వహించాలన్న మీ సర్కారుకు ప్రాధాన్యతలే కాదు, చివరికి పోయి కూడా లేదని తేలిపోయింది. కేసీఆర్ హయాంలో మూడు నెల ముందు నుంచే పంటల కొనుగోలు ప్రణాళికలను పకడ్బందీగా అమలుచేసే వారు. గన్నీ బ్యాగుల నుంచి మొదలుకుని రైతుల ఖాతాల్లో పంట డబ్బులు సకాలంలో జమ అయ్యేదాకా నిరంతర సమీక్షలతో పర్యవేక్షించేవారు. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాల నుంచి తమ పంటను కాపాడుకునేందుకు చివరికి టార్పాలిన్లు కూడా సమకూర్చలేని మీ కాంగ్రెస్ సర్కారు ఉండి రైతులకు ఏం ప్రయోజనం అన్నారు. 60 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు మరణశాసనం రాసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రమంతా రైతుల నిరసనలు హోరెత్తుతున్న ఈ తరుణంలో 23న నిర్వహించే కేబినెట్ సమావేశంలోనైనా లెంపలేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టండని కెటిఆర్ తన లేఖలో కోరారు.

# దేశ అభివృద్ధిలో రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి : దీపక్ జాన్

- వర్ధంతి సందర్భంగా
ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు..

ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ :
మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్ డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ ట్రెజరర్ నాగులూరి సాయిబాబా ఆధ్వర్యంలో చిలకలగూడ జీహెచ్ఎంసీ పార్క్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య సేవలను అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిబిరానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ హాజరై మాట్లాడారు. రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పని






చేస్తోందని పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్న వైద్యులు కాలనీ వాసులు, వాకర్స్ మరియు స్థానిక ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, సాధారణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో ఆరోగ్య సేవలు అందించడం ఎంతో ముఖ్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమం మొత్తం సేవా భావంతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సతీష్ కుమార్, ప్రమోద్, దేవుడు వెంకట్, అంజి, బాబు, కుమార్, కేబుల్ శ్రీను, ఆంజనేయులు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కాలనీవాసులు, యువకులు, మహిళలు, వాకర్స్ భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జాడి రమేష్‌కు ఓయూ నుంచి డాక్టరేట్

ఏ ఎం న్యూస్, ఓయూ:



ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం నుంచి సీనియర్ ప్రొఫెసర్ వీరేనేని జగదీశ్వర రావు పర్యవేక్షణలో పొలిటికల్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ ఇన్ పంచాయతీ రాజ్ ఇనిస్టిట్యూషన్స్: ఏ కే స్టడీ ఆఫ్ కరీంనగర్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను జాడి రమేష్‌కు ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల విభాగం డాక్టరేట్‌ను ప్రకటించింది. కరీంనగర్ నగరపాలక సంస్థ మల్కాపూర్ 16వ డివిజన్ చెందిన జాడి శాంతమ్మ కనకయ్య దంపతుల కుమారుడు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామపంచాయతీలు, మండల పరిషత్తులు జిల్లా పరిషత్లలో మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం ఎలా ఉంది... దీని ద్వారా మహిళా సాధికారిత ఎలా సాధ్యమవుతుంది అనేదానిపై కరీంనగర్ జిల్లాలో జాడి రమేష్ విస్తృతంగా పరిశోధించారు. తన పరిశోధనకు సహకరించిన పీహెచ్డీ సూపర్వైజర్ ప్రొఫెసర్ వీరేని జగదీశ్వరరావు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఓయూ సోషియాలజీ హెడ్ ప్రొఫెసర్ పి విష్ణువేద్, బి ఓ ఎస్ చైర్మన్ డాక్టర్ రామ్ షెఫర్డ్ భీనవేణి, డాక్టర్ సిహెచ్ పరందాములు లకు జాడి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

### సెంట్రింగ్ కార్మికులు, కాంట్రాక్టర్లకు
## బీజేపీ సంపూర్ణ మద్దతు : మేకల సారంగపాణి

ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ :



సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహం వద్ద సెంట్రింగ్ కార్మికులు, కాంట్రాక్టర్లు నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఉంటుందని మేకల సారంగపాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుతామని, వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అన్నారు. నిరంతరం కష్టపడి పనిచేసే సెంట్రింగ్ కార్మికులు, చిన్న కాంట్రాక్టర్ల జీవనోపాధి రక్షణకు అన్ని రాజకీయ పార్టీలు అండగా నిలవాలని కోరారు. కార్మికులు చేపట్టిన ఈ పోరాటంలో చివరి వరకు భాగస్వాములుగా ఉంటామని మేకలసారంగపాణి హామీ ఇచ్చారు. చైర్మన్ యాదగిరి, అధ్యక్షుడు అంజయ్య, ఎం. యాదగిరి, రవి, అశోక్ కుమార్, నరసింహ, రాము, మల్లేష్, మధు, బీజేపీ నాయకులు హనుమంతు ముదిరాజ్, సాయి దత్తు, వనమాల శ్రీనివాస్, గుర్రం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కాంట్రాక్టర్ల నిరసన 5వ రోజుకు చేరిక

- నాచారం చౌరస్తాలో వంటావార్పుతో ఆందోళన..
- ఇంద్రాపార్క్‌లో మహాధర్నా..

ఏ ఎం న్యూస్, ఓయూ:




సెంట్రింగ్ పనులకు తగిన రేట్లు అమలు చేయాలని, మధ్యవర్తుల వ్యవస్థను తొలగించాలని డిమాండ్ చేస్తూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ చేపట్టిన ఆందోళన ఐదో రోజుకు చేరుకుంది. నాచారం జోన్ సెంట్రింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాచారం చౌరస్తాలో గురువారం వంటావార్పు నిర్వహిస్తూ నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం ఇంద్రాపార్క్ లో మహాధర్నా నిర్వహించనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ "మేస్త్రీలకు హఠావో.. సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు బచావో" నినాదంతో తమ సమస్యలపై పోరాటం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సెంట్రింగ్ కాంట్రాక్టర్లను ఆర్థికంగా దెబ్బతీస్తున్న మధ్యవర్తుల వ్యవస్థను తొలగించి, సెంట్రింగ్ పనులకు సరైన రేట్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన డిమాండ్లలో 10 అడుగుల ఎత్తు జాక్ సెంట్రింగ్ పనులకు ఎస్ఎఫ్‌టీకి రూ.51 అమలు చేయడం, ప్రతి అంతస్తుకు 10 శాతం లిఫ్టింగ్ ఛార్జీలు ఇవ్వడం, బిల్డర్లు మరియు గృహనిర్మాణదారులు సెంట్రింగ్ కాంట్రాక్టర్లతో నేరుగా ఒప్పందాలు చేసుకోవడం ఉన్నాయి. సంఘ నాయకులు రత్లవత్ రాములు నాయక్, సంఘముల శ్రీనివాస్ కుర్మ (వైస్ ప్రెసిడెంట్), వి. సంతోష్ నాయక్, దేవేందర్, శేఖర్, రమేష్, మధు, లక్ష్మణ్ ఠాగూర్ తదితరులు మాట్లాడుతూ, 2016లో సెంట్రింగ్ పనులకు ఎస్ఎఫ్‌టీకి రూ.40గా నిర్ణయించామని, ప్రతి ఏడాది ఒక రూపాయి చొప్పున పెంచాలని నిర్ణయించినప్పటికీ అది అమలు కాలేదని తెలిపారు. మొలలు, చెక్కలు, వాల్ ప్లేట్లు, రవాణా ఖర్చులు, లోడింగ్-అన్‌లోడింగ్ వ్యయాలు, కార్మికుల కూలీలు భారీగా పెరిగినా సెంట్రింగ్ రేట్లు పెరగకపోవడం వల్ల కాంట్రాక్టర్లు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతు న్నారని పేర్కొన్నారు. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి పని చేస్తున్న కాంట్రాక్టర్లు కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎలక్ట్రిషియన్‌లు, ప్లంబర్లు, కార్పెంటర్లతో బిల్డర్లు నేరుగా ఒప్పందాలు చేసుకుంటున్నట్లే సెంట్రింగ్ కాంట్రాక్టర్లతో కూడా నేరుగా చర్చలు జరపాలని కోరారు. ప్రస్తుతం పలువురు సెంట్రింగ్ కాంట్రాక్టర్లు తమ మెటీరియల్‌ను స్క్రాప్‌కు విక్రయించి ఆటో, క్యాబ్ డ్రైవర్లుగా మారే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

### టాస్క పోరాటాలతో
## వయోవృద్ధులకు పలు హక్కులు సాధ్యం
### నాచారం టాస్కా సర్కిల్ నూతన కమిటీ ఎన్నిక

ఏ ఎం న్యూస్, ఓయూ:




తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్క) చేపట్టిన పోరాటాల ఫలితంగానే వయోవృద్ధులు పలు చట్టబద్ధమైన హక్కులు, సంక్షేమ ప్రయోజనాలు సాధించుకోగలిగారని టాస్కా రాష్ట్ర అధ్యక్షులు పి. నరసింహారావు పేర్కొన్నారు. ఇంకా వయోవృద్ధుల సంక్షేమం కోసం సాధించాల్సిన అంశాలు అనేకం ఉన్నాయని ఆయన అన్నారు. నాచారం ఓల్డ్ విలేజ్ లోని శ్రీ వెంకటేశ్వర భక్త సమాజం భవనంలో గురువారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాచారం సర్కిల్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు అతిథులు ప్రసంగించారు. జేఏసీ సంస్థల వ్యవస్థాపకులు నల్లా రాధాకృష్ణ పాటల ద్వారా సీనియర్ సిటిజన్లలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమానికి టాస్క జిల్లా అధ్యక్షులు ఎం.వి. రామచంద్రమూర్తి అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఎన్. చౌదరి, రాష్ట్ర కార్యదర్శి వెంకయ్య గౌడ్, ఎన్నికల అధికారి రామ్ రెడ్డి, నాచారం టాస్క అధ్యక్షులు ఎం.వి. ప్రేమ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పడాల సాయిబాబా, గౌడెల్లి సావిత్రి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టాస్క నాచారం సర్కిల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి. ఆంజనేయ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పడాల సాయిబాబా, ఉపాధ్యక్షులుగా కొమ్మగాళ్ల వెంకటేష్, చెల్లపురం శ్రీరాములు, జాయింట్ సెక్రటరీగా ఎం.డి. రజాక్, ఖజాంచీగా ఎం. రంగారెడ్డి ఎన్నికయ్యారు. అదేవిధంగా ఈసీ సభ్యులుగా టీ. కృష్ణ, కేవీ సుబ్బారావు, పి. నరసింహ గౌడ్, బి. మధుసూదన్ రావు, ఎం. శ్రీహరి చారి ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

ఏఎం న్యూస్, కాళేశ్వరం,మే21:
సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. వీరంతా తొలుత పుష్కరస్నానం ఆచరించి ప్రారంభంచారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు సైతం ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తోపాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేవారు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులను 300కు పైగా ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. జూన్ 1 వరకు ప్రతిరోజు సాయంత్రం హారతి ఉంటుంది. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు.

# కూకట్పల్లిలో తొంబై శాతం అభివృద్ధి జరిగిందన్నవి కేవలం ఎమ్మెల్యే ప్రగల్భాలే

**- అదే నిజమైతే చెరబండరాజునగర్ శ్మశానవాటిక ఎందుకు బాగుపడలేదు...**
**- పర్యటనల పేరుతో అధికారుల వేధింపు...**
**- కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు తీరుపై కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డి ఫైర్...**

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : కూకట్‌పల్లి నియోజకవర్గంలో 90 శాతం అభివృద్ధి పూర్తయిందంటూ స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేస్తున్న వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలని కేవలం ప్రజల్లో తన ఉనికిని కాపాడుకునేందుకే ఆయన ఆరాటపడుతున్నారని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పర్యటనల పేరుతో ఎమ్మెల్యే అధికారులను ముప్పుతిప్పలు పెడుతున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన మీడియా కి విడుదల చేసిన ఓ ప్రకటన లో మాట్లాడుతూ ఎమ్మెల్యే తీరును, బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలను ఘాటుగా విమర్శించారు. నియోజకవర్గంలో 90 శాతం అభివృద్ధి జరిగిపోయిందని, ఇంకా పది శాతం మాత్రమే మిగిలి ఉందని ఎమ్మెల్యే కృష్ణారావు ప్రతినిత్యం మైకుల ముందు భాషణాలు ఇస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారనీ మరి ఆయన చెప్పే ఆ 90 శాతం అభివృద్ధి చెరబండరాజునగర్ శ్మశాన వాటికలో ఎందుకు జరగలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని యుగంధర్ రెడ్డి నిలదీశారు. అభివృద్ధికి నోచుకోని ఆ శ్మశానవాటిక గురించి ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, బాలానగర్ మాజీ కార్పొరేటర్ మాట్లాడటం అత్యంత హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇన్నాళ్లు అధికారంలో ఉండి చేసిందేమీ లేదని, ఇప్పుడు కేవలం రాజకీయ ఉనికి కోసం వీధుల వెంట పర్యటిస్తూ డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో అంతా అభివృద్ధి జరిగిపోయిందని స్వయంగా చెబుతున్న ఎమ్మెల్యే మళ్లీ పర్యటనల పేరుతో అధికారులను ఎందుకు వెంట తిప్పుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని యుగంధర్ రెడ్డి ఆరోపిం చారు.



ఎమ్మెల్యే కృష్ణారావు వ్యవహార శైలి పట్ల అధికారులు ఇప్పటికే తీవ్ర విసుగు చెందారనీ కేవలం తన రాజకీయ మనుగడ కోసం వారిని వాడుకోవడం మంచి సంప్రదాయం కాదన్నారు. అధికార యంత్రాంగం అంతా ప్రస్తుతం నివురుగప్పిన నిప్పులా ఉందని ఎమ్మెల్యే వేధింపులు భరించలేక వారు ఏ క్షణంలోనైనా ఆయనపైకి తిరగబడే అవకాశం ఉందని తమకు విశ్వసనీయ సమాచారం ఉందన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే నిజమైన అభివృద్ధి జరుగుతోందని యుగంధర్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు కేటాయించి, కూకట్‌పల్లి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతోందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. పనికిమాలిన పర్యటనలు మాని, ఎమ్మెల్యే కృష్ణారావు ఇకనైనా వాస్తవాలు మాట్లాడాలని ఆయన హితవు పలికారు.

# కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్యుడిపై భారం

**- పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : కార్పోరేట్ శక్తులకు కోట్ల రూపాయల ప్రజాధనం ధారాదత్తం చేస్తున్న మోడీ ప్రభుత్వం ప్రజలపై పెనుబారం మోపుతోందని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ఆరోపించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచిందని కేంద్ర ప్రభుత్వ వైఖరిపై గాంధీ భవన్‌లో జరిగిన పత్రిక సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం విమర్శించారు. యూపీఏ హయాంలో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజలపై భారాలు వేయలేదని గుర్తుచేశారు. ముడి చమురు ధరలు తగ్గిన కేంద్రం ఎక్సైజ్, సుంకాలు సెస్సుల పేరుతో ప్రజలను దోచుకుంటోం దన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోడీ డబులింజన్ సర్కార్ ఉన్న రాష్ట్రాలలో పాలన అద్భుతం, అమోఘం యావత్ దేశ అభివృద్ధి వికసిత్ భారత్ వైపు దూసు కెళ్తుంది అన్నారని రాష్ట్రాల పాలనలో అన్ని రంగాల్లో ఆర్థిక వ్యవస్థ ధ్వంస మైందని విమర్శించారు. ఊదరగొట్టిన ప్రసంగాలకు, మీడియా కల్పిం చిన విస్తృత ప్రచారం చూసి ప్రజలు నిజంగానే నమ్మారని పిస్తోందనీ ఆయా రాష్ట్రాలలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయని బీజేపీ పాలిత రాష్ట్రాలలో, కేంద్రంలో అన్ని రంగాల్లో పరుగులు పెడుతూ ఆర్థిక వ్యవస్థ స్వర్ణయగంలో నడుస్తుందని మోడీ భజన పరులు కీర్తిస్తున్నారని అన్నారు. ఇదంతా చూసి ప్రజలు ఓట్లను వేసి గెలిపిస్తే వారం



తిరగకముందే దేశమంతటా తిరుగుతూ దేశం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నదనీ ప్రజలు దేశ భక్తిని చాటుకోవాలంటూ ఉచిత పొదుపు సూత్రాలను వల్లెవేస్తూ, ప్రజలు దుబారా ఖర్చును తగ్గించుకోవాలని కర్తవ్య బోధన చేసారని అన్నారు. ఇప్పటికే రూపాయి విలువ రికార్డు స్థాయిలో డాలర్ ఏ రూ. 96.90 వారం నుంచి బ్రేక్ లేకుండా పడుతున్న రూపాయి దిగజారి వందకు చేరువలో పతనా స్థితికి వెళ్తంది. డాలర్‌తో పోటీపడి ప్రపంచ ఆర్థిక రంగంలో అగ్రగామి దేశంగా ఎలా నిలుస్తుంది. 500 ట్రిలియన్ డాలర్లకు ఎప్పుడు చేరువ వుతుంది మనది అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అంటూ విదేశాల్లో మోదీ గప్పాలు కొడుతూ తన అసమర్థతను ప్రజలపై రుద్దుతున్నారనీ సత్యం శ్రీరంగం విమర్శించారు.

### సెంట్రింగ్ కార్మికుల
## సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి
**- కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : గ్రేటర్ హైదరాబాద్ భవన నిర్మాణ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికులు సమస్యల పరిష్కారానికి చేస్తున్న నిరసనకు మద్దతుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం కూకట్పల్లి ఏవీబీపురంలో సెంట్రింగ్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి హాజరై వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా





ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ కార్మికులు ఎంతో కీలకపాత్ర వహిస్తారని అటువంటిది వారికి ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం అండగా ఉండాల్సిన బాధ్యత ఉందని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్మాణ దశలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తు చేశారు. ప్రధానంగా ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే నిరుపేదలైన వారి కుటుంబాలు రోడ్ న పడుతున్నాయని దీనికి బీమా సౌకర్యం కల్పించి భరోసా ఇవ్వాలని, అలాగే ఏదైనా అక్రమ నిర్మాణ భవనాలు సమస్య వచ్చినప్పుడు వీరి యొక్క సామాగ్రిని అధికారులు ధ్వంసం చేయడం అలాగే వారి సామాగ్రికి భద్రత లేకపోవడం ఆందోళన కలిగించే అంశం అని దీనికి భరోసా కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. అలాగే కార్మిక శాఖ నుండి గుర్తింపు కార్డు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు గుర్తింపు కార్డు లేకపోయినా పోలీస్ ఎఫ్ఐఆర్ ను ప్రామాణికంగా తీసుకుని తగిన న్యాయం జరిగేటట్లు చూడాలని తెలిపారు. ఈ సమస్యలను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి కూడా తీసుకెళ్తామని బిఆర్ఎస్ పార్టీ తరఫున సెంట్రింగ్ కార్మికులకు అండగా ఉంటామని కృష్ణారావు పిలుపునిచ్చారు.

### నవభారత నిర్మాణానికి సాంకేతికతే పునాది అని
## నమ్మిన విజనరీ లీడర్ భారతరత్న రాజీవ్ గాంధీ
**పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



రాజీవ్ కలలుగన్న ఆధునిక, సాంకేతిక, సశక్త భారత నిర్మాణమే మనందరి లక్ష్యం కావాలనీ పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. భారతరత్న, స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35 వ వర్ధంతి సందర్భంగా కేపిహెచ్బి కాలనీ రాజీవ్ సర్కిల్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి డాక్టర్ సత్యం శ్రీరంగం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఆధునిక భారత సంస్కరణల సృష్టికర్త, మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ అని ప్రపంచం ముంగిట నేడు అగ్రగామిగా దేశం ఉందంటే నాడు విద్య, సాంకేతికత, గ్రామీణాభివృద్ధి,ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతికి మూల స్తంభాలు ఐటీ రంగానికి పితామహుడుగా టెలికమ్యూనికేషన్ విప్లవానికి ఆద్యుడుగా,దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడిగా రాజీవ్ గాంధీది ఎన్నటికీ చెరగని ముద్ర అన్నారు. గ్రామ స్వరాజ్య సాధనకు పునాదులు వేసి, స్థానికసంస్థల్లో మహిళలకు 33%రిజర్వేషన్లు, యువతకు 18ఏళ్లకే ఓటుహక్కు కల్పించి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కీలక సంస్కరణలు తీసుకొచ్చిన రాజీవ్ గాంధీ పాలన ఆచరణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంటెస్టెడ్ కార్పొరేటర్లు గోపిశెట్టి రాఘవేందర్, గంధం రాజు, డివిజన్‌ల అధ్యక్ష్యులు తమ్మినేని ప్రవీణ్, సతీష్ గౌడ్, కృష్ణ రాజ్ పుత్, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, ఫణింద్ర, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, డివిజన్‌ల మహిళా అధ్యక్షురాళ్లు రజిత, మారుతీ, పొడుగు అప్పారావు, కనకయ్య, నితీశ్ గౌడ్, వనజ తదితరులు పాల్గొన్నారు.

### శస్త్ర చికిత్స చేసుకున్న బిజెపి సీనియర్ నాయకుడ్ని
## పరామర్శించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు...


ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : మూసాపేట్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు నవీన్ గౌడ్ నడుము నొప్పితో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం చికిత్స పొందుతున్న విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నవీన్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు.



ఈ సందర్భంగా నవీన్ ఆరోగ్య పరిస్థితిని, చికిత్స వివరాలను తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, త్వరలోనే పూర్తిగా కోలుకుంటారని ధైర్యం చెబుతూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీనియర్ బీజేపీ నాయకులు కర్కాడాకయ్య, ఐలయ్య యాదవ్, శ్రీనివాస్, రవికుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ
## సేవలు మరువలేనివి... : బండి రమేష్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



దివంగత మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని కూకట్పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కెపిహెచ్బి కాలనీ మలేషియా టౌన్షిప్ సర్కిల్లోను బాలనగర్ చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ ప్రధానిగా రాజీవ్‌గాంధీ చేసిన సేవలను ఆయన కొనియాడారు. దేశంలో ముందుగా సంస్కరణల రంగంలో, ఐటి సెక్టార్లో విప్లవాత్మక మార్పులు చేపట్టింది రాజీవ్ గాంధీ అన్నారు. నాడు ఆయన చేపట్టిన సంస్కరణల కారణంగానే దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోయింది అన్నారు. పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగానే కాంగ్రెస్ పాలన కొనసాగేదన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే ప్రభుత్వ ఏర్పడుతుందన్నారు. ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కార్యకర్తలు గట్టిగా కృషి చేయాలని రమేష్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, మైనారిటీ నాయకులు, sc సెల్ నాయకులు, బీసీ సెల్, సేవ్ దళ్, అభిమానులు పాల్గొన్నారు.

## ఓయూ సీఈ -స్మార్ట్‌బ్రిడ్జ్ మధ్య అవగాహన ఒప్పందం
**విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లు, హ్యాకథాన్‌లు**


ఏ ఎం న్యూస్, ఓయూ: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల, స్మార్ట్‌బ్రిడ్జ్ సంస్థ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దే లక్ష్యంతో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ భాగస్వామ్యం ద్వారా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లు, హ్యాకథాన్‌లు, అనుభవాత్మక అభ్యాస




(ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్) కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఒప్పందం ఓయూ సీఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్ సమక్షంలో జరిగింది. కార్యక్రమంలో స్మార్ట్‌బ్రిడ్జ్ తరఫున వైస్ ప్రెసిడెంట్ (స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్స్) ఎస్. శ్రీదేవి, లీడ్ యాక్సిలరేటర్ (రోబోటిక్స్, ఐఓటీ) డా. డి. నరేందర్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పి. చంద్ర శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు సిద్ధాంతపరమైన విద్యతో పాటు ప్రాయోగిక అనుభవాన్ని అందిం చడంలో ఈ భాగస్వామ్యం కీలకంగా నిలుస్తుందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతలపై విద్యా ర్థులు ప్రత్యక్ష అవగాహన పొందడంతో పాటు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో వారు సిద్ధ మవుతారని పేర్కొన్నారు. స్మార్ట్‌బ్రిడ్జ్ వ్యవస్థాపకుడు, సీఈఓ కె. అమరేందర్ మాట్లాడుతూ, ఈ భాగ స్వామ్యం పరిశ్రమలు--విద్యాసంస్థల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా, ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించే ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుందని అన్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ నిపుణుల ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌లు, వాస్తవ ప్రపంచ ప్రాజెక్టులు, పరిశ్రమ ఆధారిత శిక్షణా అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. దీని ద్వారా విద్యార్థుల ఉద్యోగావకాశాలు పెరగడంతో పాటు వారి వృత్తి అభివృద్ధికి కూడా గణనీయమైన దోహదం అందనుంది.

## మల్కాజ్గిరి కమిషనర్‌ను కలిసిన బీజేపీ ప్రతినిధి బృందం
**- ఉప్పల్ నియోజకవర్గ ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చ**

ఏ ఎం న్యూస్, ఓయూ: మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని గురువారం ఆయన కార్యాల యంలో బీజేపీ ప్రతినిధి బృందం కలిసి ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించింది. ఈ



సమావేశంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్‌తో పాటు బేతి సుభాష్ రెడ్డి, గొరిగె కృష్ణ, పోతగాని గోపాల్ గౌడ్, అంబటి వెంకటాచలం, తిండేరు హనుమంతరావు, జి. రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతి, దోమల నివారణ చర్యలు, జనాభా లెక్కలు, త్వరలో ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమం, ఇంటి నంబర్ల కేటా యింపు, పార్కుల అభివృద్ధి వంటి అంశాలపై కమిషనర్‌తో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని, అనేక పనులు కుంటుపడి నత్తనడకన కొనసాగుతున్నాయని బీజేపీ ప్రతినిధి బృందం కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లింది. ప్రజలకు మౌలిక వసతులు సకాలంలో అందకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది.అలాగే త్వరలో నిర్వహించనున్న ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించి బీఎల్‌వోలకు తగిన అవగాహన, నైపుణ్యం లేని సిబ్బందిని నియమించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్లంబర్లు, ఎలక్ట్రిషియన్లు మరియు ఇతర విభాగాలకు చెందిన సిబ్బందిని సరైన శిక్షణ లేకుండా ఎస్ఐఆర్ విధుల్లో నియమించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అనుభవం కలిగిన సిబ్బందిని నియమించాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని బీజేపీ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది.

### సీఎం ఎ.రేవంత్ రెడ్డితో మహిళా అధ్యక్షురాలు
## జ్యోతి, డివిజన్ అధ్యక్షురాలు సుమన్ ఠాకూర్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : ముఖ్యమంత్రి అంటే మామూలు స్థానం కాదు. అంత ప్రాముఖ్యత ఉన్న ముఖ్య మంత్రి స్థానం ఉన్న వారితో ఫోటో దిగితే చాలు అనుకునేవారు చాలామంది ఉంటారు. ఈ వివరణ ఎందుకు చెప్తున్నాను అంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, యూసఫ్ గూడా డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సుమన్ ఠాకూర్‌లు గురువారం సెక్రటేరియట్ లో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్



రెడ్డితో ఫోటో దిగిన సందర్భంగా వారి సంతోషాన్ని జూబ్లీహిల్స్ నియో జకవర్గం ఎ .ఎం .న్యూస్. మీడియా రిపోర్టర్ తో పంచుకున్నారు. వివరాల్లో కెళ్తే స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి(21/5/2026)ని పురస్కరించుకుని ఖైరతాబాద్ (నియో జకవర్గం) డివిజన్ తెలంగాణ సెక్రటేరియట్ ఎదురుగా గల రాజీవ్ గాంధీ విగ్రహానికి తెలం గాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి , పలువురు మంత్రులు హాజరై ఘన నివాళులు అర్పిం చారు. ఈ కార్య క్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సూచనల మేరకు ఈ కార్యక్రమంలో జ్యోతి ( జూబ్లీహిల్స్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు) సుమన్ ఠాకూర్ (యూసఫ్ గూడా డివిజన్ మహిళా అధ్యక్షురాలు)లు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తో ఫోటో దిగే అవకాశం వారికి రావడంతో ఎదురుగా ఉన్న మహిళలను ఒక సైడ్ కి జరుపుకుంటూ సభాస్థలికి వెళ్లి ముఖ్యమంత్రితో ఫోటో దిగారు.

### చిట్టమ్మ కోడి పులావ్ బిర్యానీ కొరకు 8309112838
## (స్విగ్గి, జమోటో)కు కాల్ చేయండి : ఎం.శ్రీధర్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



కోడి పులావ్ అనేది ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో అత్యంత ప్రజాదరణ పొందిన ఘాటైన రుచికరమైన నాన్ వెజ్ వంటకం బిర్యాని కంటే తక్కువ మసాలాలతో చికెన్ సహజమైన రుచి సువాసనతో ఈ కోడి పులావ్ తయారు చేస్తారు. అటువంటి రుచికరమైన కోడిపులావ్ బిర్యానీని జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ మధురానగర్ లోని బ్రహ్మం టాలెంట్ స్కూల్ పక్కన చిట్టమ్మ కోడి పులావ్ (అమ్మ చేసిన వంట.. వండే రుచి) పేరు మీద నిర్వాహకులు మారుపల్లి శ్రీధర్, రాజ్యలక్ష్మి దంపతులు గురువారం ఘనంగా ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే వి .నవీన్ యాదవ్ నిర్వాహకుల పిలుపుమేరకు ముఖ్య



అతిథిగా పాల్గొని నిర్వాహకుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ వ్యాపార సంస్థ నిర్వాహకులు శ్రీధర్ మాట్లాడుతూ మా దగ్గర పులావ్, బిర్యానీ, టిఫిన్స్, స్నాక్స్ లభ్యమవుతాయని తెలిపారు. మా మొదటి (1) బ్రాంచ్ ఎల్లారెడ్డిగూడెం లో ఉందని, ఇది రెండవ (2) బ్రాంచ్ అని తెలిపారు. రుచికరమైన మాంసాహార భోజనాన్ని భోజన ప్రియులకు అందించాలనే లక్ష్యంతో రెండో(2) శాఖ ను ఏర్పాటు చేశామని తెలిపారు. చికెన్ 65, చిల్లి చికెన్, మటన్ పులావ్, తో పాటు పులావ్ రైస్,తో పాటు వివిధ రకాల ఆహార పదార్థాలు లభ్యమవుతాయని, 8309112838 ఫోన్ నెంబర్ కి కాల్ చేస్తే స్విగ్గి, జోమాటో సేవలు అందుబాటులో ఉన్నాయని, తెలిపారు.. ఈ కార్యక్రమంలో వెంకట రమేష్, రాజేష్, వెంగళరావు నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవి రెడ్డి నాగార్జున రెడ్డి, వెంగళరావు నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సురేఖ భవాని, ఊర్మిళాదేవి, సుమన్ ఠాకూర్ (శ్రీకృష్ణ నగర్), పాల్గొని షాపు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు పి .తిరుపతి, శ్రీ కృష్ణా నగర్ సంక్షేమ సంఘం సభ్యులు ఈ . ఎల్.రామయ్య, సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ శాసనాల గాలయ్య, సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.నవీన్ యాదవ్ మాట్లాడుతూ షాప్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలుపుతున్నాను అని, క్వాలిటీతో రుచికరమైన మాంసాహారాన్ని భోజన ప్రియులకు అందించే దిశగా మీ ప్రయత్నం ఉండాలని అన్నారు.

### బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు పులిరాం
## పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరిపిన మిత్రులు..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : వారు ముగ్గురు ఒక టీమ్ మెంబర్స్ లాగా, అన్నదమ్ముల్లాగా, కలిసి మెలిసి వారి సమస్యలను ఒకరి నొకరు తెలుసుకుంటూ, స్థానిక సమస్యలను తెలుసుకొని అధికారులకు చేరవేస్తూ స్నేహమంటే ఇలాగే ఉండాలి అనే విధంగా కలసి మెలసి తిరుగుతున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు బడుగు



సతీష్ ,బరిగల జ్ఞానేశ్వర్, పులి రామ్ లను చూసి మిత్రులు అంటే ఇలాగే ఉండాలి అనుకుంటారు. అటువంటి మిత్రులలో ఒకరైన పులిరామ్ పుట్టినరోజు గురువారం. మిత్రులందరూ కలిసి ప్రత్యేక కేకును తీసుకొచ్చి వెంకటగిరి నుండి హైలంకాని వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న గణేష్ చౌక్ ముందు పులిరాంకి శాలువాతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేపించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొన్న మిత్రులలో బడుగు సతీష్, బరి గల జ్ఞానేశ్వర్, సందీప్, విష్ణు (యోగ మాస్టర్, డాక్టర్), రవితాప (సోషల్ వర్కర్), జగదీశ్వర్ పాల్గొన్నారు. ఈ పుట్టినరోజు వేడుకలలో పులి రామ్ పుత్రులైన రితీష్ (పెద్దకొడుకు), వరుణ్ (చిన్న కొడుకు)లు కలిసి తండ్రి (పులి రామ్)పాదాలకు మొక్కి, ఆలింగనం చేసుకొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పుట్టినరోజు వేడుకలు దివ్వెల మధ్య ఘనంగా జరిపారు మిత్రులు.


## శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన గద్వాల్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి.




## శుభాకాంక్షలు తెలిపిన మాగంటి సునీత గోపీనాథ్..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : బిఆర్ఎస్. పార్టీ రాష్ట్రస్థాయిలో ప్రకటించిన పార్టీ మెంబర్షిప్ ఇంచార్జ్ పదవులలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ మెంబర్షిప్ ఇన్చార్జిగా మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్ రెడ్డిని ప్రకటించింది. ఈ సందర్భంగా ఏ .ఎం . న్యూస్ మీడియా ద్వారా పి. విష్ణువర్ధన్ రెడ్డి కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు మాగంటి సునీత గోపీనాథ్ (జూబ్లీహిల్స్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థిని).



## ఘనంగా దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

ఏ ఎం న్యూస్, ఓయూ: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మాణికేశ్వర్ నగర్ లోకాంగ్రెస్ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి



నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, సాంకేతిక రంగంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. యువత సాధికారత, ఆధునిక భారత నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తార్నాక డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సీనియర్ వేముల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు.. కె. నరసింహ, ఆలకుంట గణేష్, బి. వెంకటేష్, గండికోట వెంకటేష్, గండికోట కుమార్, వరికుప్పల రవి, లింగయ్య, వరద రాజా, అనిల్ కుమార్, కిషోర్ యాదవ్, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

mana cinemalu

# మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం

### క్లాప్ కొట్టిన తమ్ముడు పవన్ కళ్యాణ్






మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం గురువారం మొదలైంది. కె.ఎస్.రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై కె. నారాయణ నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ క్లాప్ కొట్టారు. చిరంజీవి కుమార్తె సుస్మిత కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు వి.వి.వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసక్తికర విషయాలు చోటు చేసుకున్నాయి. అన్నపూర్ణ స్టూడియోకు చిరంజీవి, తన సోదరుడు పవన్‌కల్యాణ్ ఒకే కారులో వచ్చారు. తదుపరి నాగబాబు జాయిన్ అయ్యారు. ముగ్గురు కలిసి ఒకే సోఫాలో కూర్చుని చక్కగా ముచ్చటించుకున్నారు. చిరంజీవి పక్కన ఉన్నంత సేపు పవన్ ఎంతో వినయంగా ఉన్నారు. ఈ దృశ్యాన్ని చూసి అభిమానులు సంబరపడిపోయారు. చాలాకాలం తర్వాత ముగ్గురు సోదరులను ఒకే వేదికపై చూడటం కనుల విందుగా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలాగే చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్ ఫొటోలను చిత్రించిన పట్టు శాలువాతో చిరంజీవిని సన్మానించింది చిత్ర బృందం. మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. పవన్‌కల్యాణ్‌కి భక్తుడైన బండ్ల గణెళిశ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బండ్లను చూడగానే పవన్ దగ్గరకు తీసుకుని భుజంపై చేయి వేసి మాట్లాడుతూ లోపలికి తీసుకెళ్లారు. ఆ కాసేపు బండ్ల మొహం హై వోల్టేజ్ బల్బ్‌లా వెలిగిపోయింది. ఎప్పటిలాగే వినయంగా చేతులు కట్టుకుని మాట్లాడారు బండ్ల గణెళిశ్. చిరంజీవి సైతం బండ్లను హత్తుకున్నారు. అభిమానులు మాత్రం 'బండ్లన్నకు ఇవాళ పండగే.. ఆయన అభిమానించే హీరోలతో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఈ రోజు ఆయనకు నిద్ర పట్టదేమో' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి అనశ్వర రాజన్ కూడా హాజరయ్యారు. ఈ చిత్రంలో ఆమె చిరుకు కుమార్తెగా కనిపించనున్నట్లు టాక్ నడుస్తోంది.

## డ్రాగన్‌కు 64 మిలియన్ల వ్యూస్




పొరపాటున కూడా నా కలలోకి రావొద్దు' అంటూ రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్. ఆయన ప్రధాన పాత్రలో ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డ్రాగన్' తారక్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి మొదటి అప్‌డేట్‌గా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 4 నిమిషాలు ఉన్న ఈ వీడియో సోషల్ మీడియాను షేక్ చేసింది. ఇప్పుడు రికార్డును కూడా నమోదు చేసింది. 24 గంటల్లో 'డ్రాగన్' గ్లింప్స్ 64 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకున్నట్లు టీమ్ తెలిపింది. ఇప్పటివరకూ ఇండియాలో ఏ సినిమా గ్లింప్స్‌నకు ఇన్ని వ్యూస్ రాలేదని వెల్లడించింది. ఇది ఆల్‌టైం రికార్డు అంటూ పోస్టర్ విడుదల చేసింది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులో మరిన్ని రికార్డులు రావడం ఖాయమంటూ ఫ్యాన్స్ భావిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన గ్లింప్స్‌లో ఎన్టీఆర్ 'డ్రాగన్'గా రక్తపాతం సృష్టించే శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. విజువల్స్ ప్రత్యేకమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరించాయి. 'కె.జి.ఎఫ్' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించిన దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్' తర్వాత తెరకెక్కిస్తున్న సినిమా ఇది. ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది.




## చిరుకు కూతురుగా అనస్వర




చిత్రపరిశ్రమలో ఎప్పుడు ఎవరిని అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. కొంతమందికివరుస విజయాలు అందుకున్నా కొన్నిసార్లు ఛాన్స్ లు రావు. మరికొంతమందికి ఒక్క సినిమా చేసినా మెగా ఛాన్స్ వచ్చేస్తోంది. తాజాగా మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ రెండో కేటగిరిలో ఉందని చెప్పొచ్చు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ కెరీర్ ను ప్రారంభించిన ఈ బ్యూటీ ప్రస్తుతం స్టార్ హీరోయిన్ గా కొనసాగుతోంది.ఛాంపియన్ సినిమాతో అనస్వర తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి మిక్స్డ్ టాక్ ను అందుకుంది. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా అనస్వర న్యాచురల్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అమ్మడికి టాలీవుడ్ లో మంచి భవిష్యత్ ఉంటుందని జోస్యం కూడా చెప్పారు. ఇప్పుడు ఆ జోస్యం నిజమైంది. ఈ చిన్నది తన రెండో సినిమానే మెగాస్టార్ చిరంజీవితో చేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి- బాబీ కొల్లి కాంబోలో వస్తోన్న చిత్రం మెగా 158. కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రం తాజాగా పూజా కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. ఈ ప్రారంభోత్సవంలో పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం విశేషం. చిరంజీవిపై చిత్రీకరించిన ప్రారంభ సన్నివేశానికి పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టారు. ఇక ఈ చిత్రంలో అనస్వర ఒక కీలక పాత్రలో నటించబోతోంది. చిరుకు కూతురిగా ఆమె నటిస్తోందని తెలుస్తోంది. మెగాస్టార్ సినిమాలో ఒక చిన్న పాత్ర చేసినా అది ఈ తరం నటీనటులకు అచీవ్ మెంట్ అని చెప్పొచ్చు. ఎన్నోఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్లకు రాని మెగా ఛాన్స్ రెండో సినిమాకే ఈ మలయాళ బ్యూటీకి దక్కడం నిజంగా ఆమె అదృష్టమని నెటిజన్స్ అంటున్నారు. ఏది ఏమైనా అనస్వర నక్కతోక తొక్కింది అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## ఉప్పెనను మించిన ట్విస్ట్ ఉంటుంది




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా బుచ్చిబాబు, రామ్ చరణ్ కార్ డ్రైవ్ చేస్తూ ఇంటర్వ్యూ నిర్వహించారు. 'మీకు ఇష్టమైన ఎపిసోడ్ ఏది?' అని దర్శకుడు అడగ్గా.. 'దిల్లీ ఎపిసోడ్ చాలా బాగుంటుంది. సినిమాలో నాకు ఇష్టమైన పార్ట్ అది. 'పెద్ది' మొత్తంలో ఎక్కువ మలుపులు ఉండేది ఆ ఎపిసోడ్‌లోనే కదా.. ఉప్పెనలో ట్విస్ట్ కంటే 100రెట్లు ఎక్కువ ఉంటుంది ఆ ఎపిసోడ్ అని చెప్పారు

## బాబీ డియోల్ బందర్ మూవీ




బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డియోల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ బందర్ . 'యానిమల్' సినిమాతో గ్లోబల్ స్థాయిలో తన పవర్‌ఫుల్ నటనతో ఆకట్టుకున్న బాబీ డియోల్, మరోసారి అంతకు మించిన ఇంటెన్స్ రోల్‌లో ఈ చిత్రం ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ట్రైలర్ చూస్తుంటే.. బాబీ డియోల్ ఈ సినిమాలో ఓ రాక్ స్టార్‌గా, విలాసవంతమైన జీవితాన్ని గడిపే 'ప్లేబాయ్' పాత్రలో కనిపిస్తున్నాడని తెలుస్తుంది. అయితే, అంతా సాఫీగా సాగిపోతున్న సమయంలో అతను అనుకోకుండా జైలు పాలు కావాల్సి వస్తుంది. అసలు బాబీ జైలుకు ఎందుకు వెళ్ళాడు? అతనిపై కేసు పెట్టిన ఆ యువతి ఎవరు? అనే ఆసక్తికర అంశాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇక ఈ చిత్రంలో బాబీ డియోల్‌తో పాటు సన్యా మల్హోత్రా, సబా ఆజాద్ మరియు సప్నా పబ్బి కీలక పాత్రల్లో మెరుస్తున్నారు. ఈ సినిమాకు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహిస్తుండగా.. నిఖిల్ ద్వివేది మరియు అనురాగ్ కశ్యప్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అన్ని హంగులతో, హై వోల్టేజ్ డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్రం 2026, జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. బాబీ డియోల్ కొత్త మేకోవర్ చూస్తుంటే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది.